క్లుప్తంగా

కొత్త కాలనీలో సదుపాయాలు కల్పించాలి



భోగాపురం ప్రకాష్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : మండలంలోని భోగాపురం గ్రామ పంచాయతీ ప్రకాష్ నగర్ కొత్త కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధికారులను కోరారు. సర్పంచ్ దిమ్మిటి నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సోమవారం కొత్త కాలనీలో పర్యటించారు. కొత్త కాలనీలో విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ, నీటి పంపులు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట భోగాపురం గ్రామ నాయకులు దిమ్మిటి రమేష్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, ఆళ్ల సతీష్ చౌదరి, కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ల భూస్వామి, మేడికొండ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



మంగమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచి ఆదుకుంటానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామంలో మరణించిన బొబ్బూరి మంగయ్య మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10 వేలు అందించారు. అనంతరం న్యాయంపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ చింతపల్లి సత్యనారాయణ సోదరుడు ఇటీవల మరణించగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి రూ.10 వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పాతూరు రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు



పాతూరు రైల్వే ట్రాక్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

భీమడోలు : జాతీయ రహదారి పక్కనే ఉన్న పాతూరు రైల్వే ట్రాక్ మరమ్మతుల పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు వద్ద గల ట్రాక్‌కు అత్యవసర మరమ్మతు పనులను రైల్వే సాంకేతిక విభాగం అధికారులు చేపట్టారు. ఈనెల 18వ తేదీన ఈ పనులు ప్రారంభించగా ఈనెల 26వ తేదీన ముగుస్తాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీనితో ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో సూరప్పగూడెం ప్రాంతం రైతులు పాతూరులోని పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అయితే గుండుగొలను, భీమడోలులోని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు.

కోళ్ల వ్యర్థాల వ్యాను సీజ్



గుడిపాడులో కోళ్ల వ్యర్థాల వ్యానును స్వాధీనం చేసుకున్న ఎస్సై చల్లా కృష్ణ

పెదపాడు : కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. పెదపాడు మండలం గుడిపాడు గ్రామానికి కోళ్ల వ్యర్థాలు తరలిస్తుండగా వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, చేపల చెరువు యజమానిపైనా కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

అంజుమన్ సంస్థకు అడ్‌హక్ కమిటీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని ముస్లింల అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థకు అడ్‌హక్ కమిటీ వేశారు. ఈ సంస్థకు ప్రస్తుత పాలక మండలి పదవీ కాలం దాదాపు ఏడాది న్నర క్రితమే ముగిసింది. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఎన్నికలు నిర్వహణపై పాలకమండలిని నిలదీయడంతో అడ్‌హక్ కమిటీ వేశారు. ప్రస్తుత పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సులేమాన్, అమీర్ జానీలతో పాటు సంస్థ శాశ్వత సభ్యుల్లోని ఎండీ ఇబ్రహీం, రాజా అహ్మద్, రియాజ్ అలీఖాన్, ఎస్ఎం అక్బర్, ఎస్కే మస్తాన్ తదితర 17 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటుచేశారు. కమిటీకి ప్రస్తుతం కమిటీ సభ్యులు సోమవారం బాధ్యతలు అప్పగించారు. అడ్‌హక్ కమిటీ ప్రతినిధులు మంగళవారం సాయంత్రం సమావేశమై ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకోనున్నారు.

జగన్‌తోనే వెనుకబడిన కులాలకు ప్రాధాన్యత

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- కైకరంలో గడపగడపకు మన ప్రభుత్వం



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు : వెనుకబడిన కులాలకు గుర్తింపు తీసుకువచ్చి, వారికి ప్రాధాన్యత కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం కైకరం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబుతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. అంతేగాక నాలుగేళ్లలో ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ బీసీలలో 127 కులాలు వరకు ఉంటే అందులో మేజరు భాగం కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని అన్నారు. బీసీలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే పేదలు ఆర్థికంగా బలపడటానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు' సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడంతోపాటు, ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడం, మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అమలు చేయడం, అమ్మ ఒడి పథకం అమలుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. సచివాలయం, వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. తొలుత మహిళలు ఎమ్మెల్యే వాసుబాబుకి హారతులు పట్టి స్వాగతం పలికారు. పూలమాలలతో సత్కరించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీను, నక్కా శ్రీను, మంద జయలక్ష్మి, మరడ మంగరావు, పెనుగొండ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు : మండలంలో ఖాళీగా ఉన్న 6 గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబర్‌పేటలో 4, పోలసానిపల్లి, సూరప్పగూడెం గ్రామాల్లో ఒకొక్కటి చొప్పున వలంటీర్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అంబర్‌పేటలో నాలుగు పోస్టులను బీసీఏ(జనరల్), బీసీబీ(జనరల్), ఓసీ(జనరల్), బీసీడీ (జనరల్)కు కేటాయించామన్నారు. పోలసానిపల్లిలో ఓసీ జనరల్‌కు, సూరప్పగూడెంలోని పోస్టును బీసీ ఏ(జనరల్) కేటాయించడం జరిగిందన్నారు. పదో తరగతి పాసై, 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అభ్యర్థులకు ఈనెల 28వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

వీరమ్మకుంట నూతన సర్పంచ్‌కు సత్కారం



వీరమ్మకుంట సర్పంచ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పెదవేగి : వీరమ్మకుంట ఉప ఎన్నికల్లో విజయం ఎంతో ప్రతిష్ఠాత్మకమని, పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచించారు. సోమవారం పెదవేగి మండలం కొండలరావుపాలెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొఠారు రామచంద్రరావులను వీరమ్మకుంట సర్పంచ్‌గా ఎన్నికైన మరడాని వెంకట లక్ష్మణ సోమేశ్వరరావు (చంటి), గ్రామ ప్రజలు, పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి సర్పంచ్ చంటి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్న ప్రభుత్వంలో ప్రజలకు సేవ చేయడం గొప్ప అదృష్టమని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంటిని దుశ్శాలువాతో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, పెద్దలు కొఠారు రామచంద్రరావు, జిల్లా బీసీ సంఘ నేత ఘంటా ప్రసాద్ తదితరులు సత్కరించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆదరణ భారం కాదు.. బాధ్యత



సీనియర్ సిటిజన్‌లను సన్మానిస్తున్న గణపవరం లయన్స్ సభ్యులు

గణపవరం : జీవితాంతం సేవలందించిన సీనియర్ సిటిజన్‌లను గౌరవించాలని, వారిని భారంగా కాకుండా బాధ్యతగా చూడాలని పలువురు అన్నారు. సోమవారం జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గణపవరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. ఈసందర్భంగా జరిగిన సభకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రావూరి నాగరాజు అధ్యక్షత వహించారు. లయన్స్ రీజియన్ చైర్మన్ వెల్లంకి నరేష్ మాట్లాడుతూ మనకోసం వారి సుఖ, సంతోషాలను ఫణంగా పెట్టి జీవితాంతం కష్టపడి మనలను తీర్చిదిద్దిన తల్లిదండ్రులను జీవిత చరమాంకంలో ఎలాంటి ఇబ్బందిలేకుండా చూసుకోవలసిన బాధ్యత మనమీద ఉందన్నారు. లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ కె.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వారికి ఎలాంటి కష్టం కలిగినా కోర్టులు అండగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్‌లను సన్మానించి, జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలోలయన్స్ జిల్లా చైర్మన్ కిలారి రవిబాబు, క్లబ్ మాజీ అధ్యక్షుడు చవ్వారవి, అబ్దుల్ గఫూర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసమే ఫ్యామిలీ డాక్టర్



చిలకంపాడులో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారిణి ప్రియాంక

గణపవరం : గ్రామీణ ప్రాంత పేద ప్రజల కోసమే ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ప్రారంభించిందని, ఈ కార్యక్రమాన్ని వినియోగించుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. సోమవారం గణపవరం మండలం చిలకంపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. పలువురి ఇళ్లకు వెళ్లి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నందున ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద 104 హెల్త్ క్యాంపు నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ పి.వెంకటనారాయణ, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, సిబ్బంది

ఏలూరు టౌన్: దోమల వృద్ధిని అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. ఏలూరు కొత్తపేట దాసరివారి వీధిలో న్యూ జనరేషన్ స్కూల్ విద్యార్థులకు, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. దోమల నివారణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. దోమకాటుతో వచ్చే వ్యాధులు, వాటిని అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు వివరించారు. 1897 ఆగస్టు 20న బ్రిటీష్ వైద్యులు సర్ రోనాల్డ్ రాస్ అనే ఆయన ఆడ అనాఫిలిస్ దోమతో మలేరియా వ్యాధి సంక్రమిస్తుందని నిరూపించారని తెలిపారు. ఆయన పరిశోధనలతో మానవాళి మలేరియా మరణాల నుంచి కొంతవరకు తప్పించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. ఈ దోమలు ఇంటి పరిసరాల్లోని నీళ్ల తొట్టెలు, పూల కుండీలు, ఫ్లవర్‌వాజ్‌లు, వాడి పడేసిన కొబ్బరి బొండాల్లోనూ వృద్ధి చెందుతాయని తెలిపారు. నీళ్ల తొట్లెలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, ఏఎస్ఎం కోటం దుర్గాదేవి, హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, రమేష్, ఆశా కార్యకర్త దేవి తదితరులు ఉన్నారు.

ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ ర్యాలీ



భీమడోలు : పూళ్లలో నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ



గణపవరం: ఎమ్మెల్యే వాసుబాబును శాంతి ర్యాలీకి ఆహ్వానిస్తున్న మానవత సభ్యులు

భీమడోలు : ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భీమడోలు మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం పూళ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, మానవత సభ్యులతో భారీ శాంతి ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీని సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రపంచ శాంతిని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లాల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు హాజరై మాట్లాడారు. ప్రపంచ శాంతి ద్వారానే ఉత్తమ జీవనం సాధ్యమని, ఒకరి పట్ల మరొకరు ప్రేమానురాగాలు కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకట కృష్ణారావు, డైరెక్టర్ కేతినీడి విశ్వేశ్వరరావు, పూర్వపు అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, జిల్లా ప్రతినిధులు టీవీ ఉమామహేశ్వరరావు, పసుపులేటి సాంబశివరావు, చిన్నారావు, పాఠశాల టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి ర్యాలీకి హాజరుకావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

గణపవరం: మానవత స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం గణపవరంలో జిల్లా మానవత సంస్థల ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్నట్లు గణపవరం, నిడమర్రు మండలాల మానవత అధ్యక్షులు కంతేటి కృష్ణంరాజు, నౌడు అచ్యుతరామారావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల మానవత క్లబ్‌ల కమిటీలు ఈ శాంతి ప్రదర్శనలో పాల్గొంటాయన్నారు. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దనుంచి సెంటర్‌లోని పోలీస్ ఐలాండ్ వరకూ శాంతి ప్రదర్శన జరుగుతుందని ప్రదర్శనలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎంపీపీ దండు రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు. సోమవారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును కలిసి జిల్లా మానవత శాంతి ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో మానవత సీనియర్ నాయకులు వెల్లంకి నరేష్, సంకు సత్యకుమార్, కాకర్ల వినాయక, పుప్పాల మేరీ, వంకాయల రామారావు, కె.సత్యనారాయణ మూర్తి, బుద్ధారపు పుల్లయ్య, సిహెచ్. నాగేశ్వరరావు, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

25న సీఆర్ఆర్ కాలేజీలో జాబ్ మేళా

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వట్లూరులో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సహకారంతో దెందులూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత రెండు వేల మందికి ఉపాధి కల్పించేందుకు సుమారు 30 కంపెనీలతో ఉదయం 09 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తమ బయోడేటాతో హాజరుకావాలని, పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు సునీల్ 94934 82414, శ్యామ్ 89785 24022, సత్యనారాయణ 96663 22032లో సంప్రదించాలని వివరించారు.

వాలీబాల్ విజేత రాయన్నపాలెం జట్టు

పెదవేగి : వాల్‌బాల్ టోర్నీలో రాయన్నపాలెం జట్టు విజయకేతనం ఎగురవేసింది. పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామంలో అబ్బయ్యచౌదరి వాలీబాల్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం ఫైనల్ మ్యాచ్‌లో కూచింపూడి జట్టు రాయన్నపాలెం జట్టు పోటీపడ్డాయి. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. మొదటిస్థానంలో నిలిచి ట్రోఫీ సాధించిన రాయన్నపాలెం టీమ్‌కు ఎమ్మెల్యే రూ.20 వేలు నగదు బహుమతిని అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై ఫిర్యాదు

దెందులూరు: దెందులూరులోని 33, 34 రేషన్ డిపోలను విచారణచేసి, ఆ షాపులను అర్హులకిచ్చి నిత్యావసర సరుకులు సకాలంలో లబ్ధిదారులకు సక్రమంగా అందేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని చల్లా మేరీ రాజు సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. సరుకుల పంపిణీలో ఫిర్యాదులు, ఇతర విషయాలను దృష్టిలో పెట్టుకుని ఆ షాపులపై మంచి నిర్ణయం తీసుకోవాలని రాజు కోరారు.

నిజమైన దేశభక్తులు సైనికులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్మీ రిటైర్డు జనరల్ బొల్లిన వెంకట్రావు

ఉంగుటూరు : సైనికులు నిజమైన దేశభక్తులు అని నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అన్నారు. సోమవారం నారాయణపురం కళాశాలలో జాతీయత – పౌరుల బాధ్యత అంశంపై రిటైర్డ్ మేజర్ జనరల్ బొల్లిన వెంకట్రావు అతిథి ఉపన్యాసం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశాన్ని అనునిత్యం కాపలా కాస్తున్న సైనికులు నిజమైన దేశ భక్తులు అని అన్నారు. ముఖ్య వక్త బీవీ రావు మాట్లాడుతూ ఆర్మీలో పనిచేసే సైనికుల జీవితం సవాళ్లతో కూడినదని, అనునిత్యం దేశ అంతర్గత, బహిర్గత విపత్తులను ఎదుర్కొంటూ జీవనం సాగించడం ఒక నూతన ఉత్తేజాన్ని అనుభూతిని కల్గిస్తుందని అన్నారు. తన 32 ఏళ్ల సైనిక జీవితంలో ఎన్నో కీలకమైన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించగలిగామని అన్నారు. శ్రీలంక ఆపరేషన్, కార్గిల్ ఆపరేషన్, పాకిస్తాన్ తీవ్రవాదులు భారతదేశంలో చొరబడిన సన్నివేశాలను, కౌంటర్ టెర్రరిస్టుల ఆపరేషన్ మొదలైన వాటిలో పాల్గొన్న అంశాలను వీడియోల రూపంలో విద్యార్థులకు చూపించి వివరించారు. కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలని తద్వారా ఉత్తమ పౌరులుగా తయారుకావచ్చని అన్నారు. కార్యక్రమంలో డాక్టరు కొండా రవి, జెడ్పీ పాఠశాల హెచ్ఎం రాంబాబు తదితరులు ప్రసంగించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న మేనేజర్ శేఖర్‌బాబు

పెదపాడు: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నవజీవన్ బాల భవన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పెదపాడు మండలం వట్లూరు జిల్లా పరిషత హైస్కూల్లో స్క్రీన్ ప్రొజెక్టరు ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ శేఖర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలో మత్తుపదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కృంగిపోతారని వివరించారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎ.లక్ష్మి, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్లు డి.రజిత, బి.నెహెమియా, కె.ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం ప్రారంభం

పెదపాడు: అప్పనవీడు అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభిస్తారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం





సమావేశానికి హాజరైన సిబ్బంది, పోలీస్ కుటుంబాలతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: పోలీస్ శాఖలో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతిచెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి హామీ ఇచ్చారు. పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన సిబ్బంది కుటుంబ సభ్యులతో సోమవారం ఆమె ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ, శాఖాపరంగా ఏదైనా ఆర్థిక ప్రయోజనాలు పెండింగ్‌లో ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉంటూ మృతిచెందిన అమరవీరుల కుటుంబాల్లోని అర్హత, ఆసక్తి గల పిల్లలకు కారుణ్య నియమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతిచెందిన సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన సౌకర్యాలు, ఆర్థిక లబ్ధి, ఇతర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. సిబ్బంది కుటుంబాలకు ఇతర సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం సిబ్బందికి సంక్షేమ దివస్ నిర్వహిస్తున్నామని, సమస్య ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని కోరారు. దిశ డీఎస్పీ సున్న మురళీకృష్ణ, పోలీస్ ప్రధాన కార్యాలయ ఏఓ బీవీఎస్ఆర్‌కే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

నిడమర్రు : సిద్ధాపురం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర శ్రావణ మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ వైఎస్ ఎంపీపీ, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ నౌడు వెంకట అచ్యుతరామారావు తెలిపారు. వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకుంటారన్నారు. ఈ పూజల్లో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషన్‌రాజు, ఎంపీ కోటగిరి శ్రీధర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు పాల్గొంటారని మాజీ సర్పంచ్ నౌడు జానకి లక్ష్మి తెలిపారు.

లిడ్‌క్యాప్ ఎండీ అవినీతిపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): ఏపీ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో ఎండీగా పనిచేస్తున్న డోలా శంకర్ అవినీతిపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జి చే సమగ్రవిచారణ చేయించాలని దళితసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. దళిత సేన ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఆర్డీఓ పంచల్ కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు.